క్లుప్తంగా

నేడు ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం

మోత్కూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.బాలాజి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు రెవెన్యూ సదస్సులు

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలపై సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీరాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులో పాల్గొని తమ భూ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న మల్లేషం

గుండాల : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కౌన్సిలర్ పురుగుల మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని వెల్మజాల గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కౌన్సిలర్ నోముల ప్రవీణ్, ఆకుల సాంబ, కళాజాత బృందం విజయ్, వీవోలు జయమ్మ, కళమ్మ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి

భూదాన్‌పోచంపల్లి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని పిలాయిపల్లిలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామానికి 45 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి తోట శ్రీనివాస్, బందెల ఆనంద్, గ్రామ శాఖ అధ్యక్షుడు గొడిసెల భూషణ్‌గౌడ్, పెరుమాండ్ల దానయ్య, తోట బాబు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తే సహించం

యాదగిరిగుట్ట : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యపై అసత్య ప్రచారం చేస్తే సహించమని ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండ్లపల్లి భరత్‌గౌడ్ అన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గంధమల్ల ప్రాజెక్టు కోసం తట్టెడు మట్టిని సైతం తీయలేదని విమర్శించారు. మోటకొండూర్ మండలాన్ని ఏర్పాటు చేసినప్పటికీ నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదన్నారు. మెడికల్ కళాశాల తామే తీసుకువచ్చామని మాజీ ఎమ్మెల్యే చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన జీఓ కాపీ ఉంటే తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. నియోజకవర్గానికి బీర్ల అయిలయ్య తన జన్మదినం సందర్భంగా రూ.1500కోట్ల నిధులు తీసుకోచ్చారన్నారు. ఆలేరు నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు బిక్షపతి, నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, గుండు నర్సింహ, బరిగే రాంచందర్, బుగ్గ ఆంజనేయులు, ఎగ్రగుంట్ల శేఖర్, గుడ్ల నరేష్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, పెలిమెల్లి శ్రీధర్, సలాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య రెడ్డి

కొత్తగూడెం రోడ్డుకు మోక్షం

- లక్ష్మాపురం – కొత్తగూడెం వరకు సీసీరోడ్డుకు నిధులు మంజూరు
- ఇటీవల ప్రారంభమైన పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



లక్ష్మాపురం- కొత్తగూడెం గ్రామాల మధ్య ప్రారంభమైన సీసీరోడ్డు నిర్మాణ పనులు

రామన్నపేట : ఎన్నో ఏళ్లుగా మండలంలోని కొత్తగూడెం గ్రామస్తులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు మోక్షం కలిగింది. లక్ష్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెంను 2018లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. లక్ష్మాపురం నుండి కొత్తగూడెం గ్రామ వరకు మట్టిరోడ్డే ఉండడంతో కనీసం నడిచి వెళ్లడానికి కూడా గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. పొలాల నుండి నీరు వచ్చి మట్టి రోడ్డుపై చేరుతుండడంతో రోడ్డంతా బురదమయంగా మారి నడవలేని పరిస్థితి ఉండేది. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉండడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే వేముల వీరేశంకు సమస్యను విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన ఆయన ప్రభుత్వానికి ప్రతిపాదనల పంపారు. ఆయన ప్రతిపాదనల మేరకు 2024 అక్టోబర్ 11న సీఆర్ఆర్ నిధుల నుంచి సీసీ రో డ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. కోటి నిధులను మంజూరు చేసింది. వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి గత నెల 24న నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రోడ్డు నిర్మాణం ఇలా..

33 అడుగుల వెడల్పుతో మట్టితో అడుగు భాగం నిర్మిస్తారు. ఆ పైన నాలుగు అంగులాల మందం కంకర పరచి రోలింగ్ చేస్తారు. ఎనిమిది అంగులాల మందం 3.65 మీటర్ల వెడల్పుతో సీసీ పరుస్తారు. పైభాగం 25 అడుగులు ఉండే విధంగా సీసీకి ఇరువైపులా మట్టిని పరచనున్నారు. రోడ్డు పనులు పనులు పూర్తయితే కొత్తగూడెం వాసుల ఇబ్బందులు తొలగిపోతాయి. ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు అష్టకష్టాలు పడిన ఆ గ్రామస్థులు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగిపోతాయి

“గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాము. మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశంకు విన్నవించాం. స్పందించి ఆయన సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పనులు ముమ్మరంగా జరుగుతుండడం ఆనందం ఉంది.



–చిల్లర కైలాసం, మాజీసర్పంచ్

గడువులోగా పనులు పూర్తి చేయిస్తాం

“కొత్తగూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పారంభమయ్యాయి. జంగిల్ కటింగ్ పని పూర్తయింది. గ్రావెలింగ్ పనులు జరుగుతున్నాయి. గడువులోగా నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తవుతాయి.

–బి.గాలయ్య, అసిస్టెంట్ ఏఈ

నేటి నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు



యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం తెలిపారు. ఆదివారం పట్టణంలో శిక్షణ తరగతులకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, జిల్లా కమిటి సభ్యులు గడ్డం వెంకటేష్, పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్‌రెడ్డి, కాల్నె స్వామి, జోగు శ్రీను, ఎస్.కే.లతీఫ్, షరీఫ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి



మాట్లాడుతున్న బిర్రు మహేందర్

భువనగిరిటౌన్ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరిలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుబ్బ రామకృష్ణ, ఈట పల్లెర్ల సుధాకర్ మాదిగ, దుప్పెల్లి అనిల్ మాదిగ, నల్ల చంద్ర స్వామి,శంకర్, దేవేందర్, లింగ స్వామి మాదిగ పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు

రామన్నపేట : మండలకేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆదివారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆలయచైర్మెన్ లవనం ఉపేందర్, భక్తులు బి.అశోక్‌కుమార్, సోమ నర్సింహాచారి, శీలా నాగభూషణం, పాండు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మోత్కూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజ స్తంభం, నవగ్రహాలు, వీరభద్రుడు, పార్వతి, కాల బైరవుడు, జంట నాగుల విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, కమిటీ సభ్యులు పట్బూరి అంజయ్య, బయ్యని రాజు, ఉయ్యాల అంజయ్య, బుర్ర కృష్ణ, జుంజూరి భిక్షపతి, కోల శ్రీను, గుండు శ్రీను, మందుల సురేష్, వంగాల బాబు, కోల దినేష్, నర్సింహ్మారెడ్డి, కమిటీ సభ్యులు బుర్ర యాదయ్య, అన్నెపు నర్సింహ్మా, పట్బూరి శివ, బైరు యాకయ్య, గొడిశాల శ్రీను, శేఖరాచారి, బద్దం అశోక్‌రెడ్డి సింధుజారెడ్డి, మంగేష్ నాగలక్ష్మి, సోలిపురం వెంకట్‌రెడ్డి సుగుణ, కంచర్ల యాదగిరిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం కవిత లక్ష్మినర్సింహ్మారెడ్డి, వేద పండితులు తంగిర్ల నరేందర్‌శర్మ, వారణాసి సుబ్రహ్మణ్యం శర్మ, మహేష్ శర్మ, రామలింగం శర్మ, హరిబాబు శర్మ, పారునంది లక్ష్మణమూర్తి శర్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తుర్కపల్లి : కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎస్సీ మోర్చా సభ్యుడు వేముల అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నరేంద్ర మోదీ పదకొండేళ్ల విజయవంతమైన పరిపాలనను పురస్కరించుకుని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌తో భారత్ రక్షణ శక్తిని ప్రపంచానికి చాటిన ఘనత మోదీదేనన్నారు. భారత్ 4వ స్థానానికి చేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మేకల శ్రీనిహాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనుహాస్, భానోత్ శత్రునాయక్, కోక్కొండ లక్ష్మినారాయణ, చాంద్ పాషా, పురుషోత్తం రెడ్డి, రమేష్‌నాయక్, జక్కుల వెంకటేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బొడ్రాయి వార్షికోత్సవాలు

రామన్నపేట : మండలంలోని బోగారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన తృతీయ వార్షికోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయికి అభిషేకాలు చేసి శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. మహిళలు బోనాలను తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో మాజీఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు అంతటి పద్మారమేష్, ఎడ్ల మహేందర్‌రెడ్డి, రేఖ యాదయ్య, మాజీ వైస్‌ఎంపీపీ బద్దుల ఉమారమేష్,మేడి రామలింగం, బీఆర్ఎస్‌పార్టీ మండలఅధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, నాయకులు కూనూరు శ్రీనివాస్, బత్తుల వెంకటేశం, ఎడ్ల నరేందర్‌రెడ్డి, జాడ సంతోష్, బొడ్డుపల్లి రాజు, బొడ్డు అల్లయ్య, ఆవుల శ్రీధర్, మేడి క్రిష్ణ, బత్తిని మహేష్, నేరటి స్వామి, పంజాల నరేష్, కె.సాయి తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

మాజీ కౌన్సిలర్ల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపల్ 2014 –2019 పాలకవర్గ సభ్యులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మృతి చెందిన మాజీ కౌన్సిలర్లు ఫతే మొహమ్మద్, అబ్దుల్ నాసిర్‌లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నువ్వుల ప్రసన్న సత్యనారాయణ, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు చందా మహేందర్ గుప్తా, చిట్టిపోలు సువర్ణ శ్రీధర్ , మొహమ్మద్ లయిక్ అహ్మద్ , వెల్దుర్తి రఘునందన్ , తాడూరి బిక్షపతి ,రాచమల్ల రమేష్, ఎనబోయిన లలిత జహంగీర్, ఎలిగే నరేష్, పట్నం రోజా శ్రీనివాస్, వేముల భాగ్యవతి అశోక్ , బోగ వెంకటేష్ , ఉమాదేవి వినోద్,యాట బారతమ్మ నాగరాజు, పడమటి జగన్మోహన్ రెడ్డి , లతా శ్రీ రవి ,పోతంశెట్టి మంజుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే బస్టాప్..!



వివేకానంద విగ్రహం వద్ద నిరుపయోగంగా ఉన్న బస్టాప్

ఆలేరు: ఆలేరు పట్టణంలోని వివేకానంద స్వామి విగ్రహం వద్ద పేరుకే ఆర్టీసీ బస్టాప్ ఉంది. కానీ ఇక్కడ బస్సులు మాత్రం ఆగడం లేదు. ఆలేరు బస్టాండ్ నుంచి వచ్చే బస్సులన్నీ ఈ బస్టాప్ వద్ద ఆగాల్సి ఉన్న ఆపకుండానే వెళ్తున్నారు. కొందరు డ్రైవర్లు బస్టాప్ వద్ద బస్సును ఆపినట్టే ఆపి వెళ్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బస్సులు బస్టాప్ వద్ద ఆగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గమ్యస్థానాలకు వెళ్లడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆలేరు బస్టాండ్ నుంచి వచ్చే బస్సులన్నీ ఈ బస్టాప్ వద్ద ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోటకొండూర్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



రాజాపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోటకొండూర్ : మండల కేంద్రంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాల 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాంటెండెంట్ విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిన్నయ్య, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, పూర్వ విద్యార్థులు కుమార్, ఎనగందుల బాలరాజు, రాజన్న, శ్రీధర్ రెడ్డి, ఉప్పలంచి ఉదయ్‌కిరణ్, గాదెగాని కరుణాకర్, సుదీప్తి, పులగం రేణుక, పద్మ, క్రాంతికుమార్, ప్రవీణ్, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

రాజాపేట : మండలంలోని చల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన 2000 – 2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు అంతయ్య, జూకంటి రాఘవాచార్యులు, వంచ ఉపేందర్‌రెడ్డి, మంజుల, బాలయ్య, రవీంద్రాచారి, మాధవి, పీ సురేష్ పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకులపై ఫిర్యాదు

మోత్కూరు: సీఎం రేవంత్‌రెడ్డిని సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషించిన ఇద్దరు యువకులపై మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిమ్మల రమేష్ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన బోగగిరి హరీష్ మన ఊరి ముచ్చట్లు వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఓ పోస్టు చేయగా అదే గ్రామానికి చెందిన నేర్లకంటి శ్రీనివాస్ అసభ్య పదజాలంతో వాయిస్ పోస్టు చేశారు. రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అమరుల ఆశయసాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరిటౌన్ : అమరుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని హనుమాన్‌వాడలో సీపీఎం మాజీ పట్టణ కార్యదర్శి కొలుపుల మల్లేశం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తారన్నారు. కమ్యూనిస్టులు చేసిన పోరాట ఫలితంగానే విద్య వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద, సీపీఎం శాఖ కార్యదర్శి బర్ల వెంకటేష్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు నాయకులు పడగెం కిషన్, వల్దాస్ అంజయ్య, విజయ్, నరాల నరసింహ, తంబు వంశీ, అజయ్ సింగ్, బండి చందు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి నూనె బహూకరణ

రాజాపేట : మండలంలోని రఘునాథపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిత్య దీపారాధనకు వెల్లెంకి గ్రామానికి చెందిన ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షుడు ఇడెం రాధ శ్రీనివాసులు ఆ దివారం నూనె బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెను సన్మానించారు. సౌ మిత్రి రఘునాథాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు సామల భాస్కర్, కటుకం సంతోష్, బూరెల శ్రీనివాస్, వెంగలదాసు యాదగిరి, దోర్నాల సిద్ధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాగు పనుల్లో అన్నదాతలు బిజీబిజీ



అడ్డగూడూరులో మొలక చల్లుతున్న రైతు



పొలంలో గొర్రు తోలుతున్న అన్నదాత

అడ్డగూడూరు : ఇటీవల వర్షాలు కురవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఆదివారం నుంచి మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మండలంలో పలు గ్రామాల్లో కొందరు రైతులు మొలకలు చ ల్లుతుండగా మరికొంత మంది రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

బీసీ, ఎస్సీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం హర్షణీయం

మోత్కూరు : మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్సీ వర్గాలకు సముచిత స్థానం కల్పించడం హర్షనీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర నాయకుడు కలిమెల నర్సయ్య అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆయ న వెంట బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, మత్స్యగిరి ఉన్నారు.

వలిగొండ : మంత్రి వర్గ విస్తరణలో ఎమ్మెల్యే వివేక్‌కు స్థానం కల్పించడంపై తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రాజాపేట : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామికి స్థానం కల్పించడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సంఘం సీనియర్ నాయకులు నేరటి బాలనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మున్నాళ్ల ముచ్చటేనా..!



కూలిన డ్రైయినేజీ పైకప్పు



విరిగిపడిన ఇనుప రేయిలింగ్

- గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి పనుల్లో పాటించని నాణ్యత
- ఆదిలోనే దెబ్బతింటున్న డ్రైయినేజీ, ఇనుప రేయిలింగ్
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మోత్కూరు : గౌరెల్లి–భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలో చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులు మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. మండలంలోని పొలడుగు, దత్తప్పగూడెం గ్రామాల్లో సర్వీస్ రోడ్లకు ఇరువైపులా చేపట్టిన డ్రైయినేజీ, రేయిలింగ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. డ్రైయినేజీ పైకప్పు, ఇనుప రేయిలింగ్ ఎక్కడికక్కడ కూలిపోతున్నాయి. దత్తప్పగూడెం మజీదు వద్ద ఫ్లడ్ డ్రైన్‌పై స్లాబ్ ధ్వంసమై ఇనుప చువ్వలు తేలాయి. గార్డ్ రెయిలింగ్ విరిగి కింద పడిపోయింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన పనులు ఇవేనా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేపట్టిన రోడ్డు పనులు ఆదిలోనే ధ్వంసమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనుల్లో నాణ్యత పాటించేలా చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యత పాటించాలి

కేంద్ర ప్రభుత్వం జాతీయ రోడ్లకు వందల కోట్లు వెచ్చిస్తోంది. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతో అవి మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

–మధుసూదన్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు

చర్య తీసుకుంటాం

సర్వీస్ రోడ్డు వెంట దెబ్బతిన్న పనులు తిరిగి చేయిస్తాం. ఫుట్‌పాత్ టైల్స్ అసంపూర్తిగా ఉన్న దగ్గర మళ్లీ వేస్తాం. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతా పాటించేలా చర్య తీసుకుంటాం.

– రామరాజు, ఏఈ, నేషనల్ హైవే